# నవతరం

RNI NO. APTEL/2014/58326

తెలుగు దినపత్రిక

సంపుటి : -13 సంచిక : 67 ఎడిషన్ ఇన్‌ఛార్జ్ : నవచైతన్య శిరిగిరి

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రాజమండ్రి

28-12-2025 ఆదివారం వెల : 1/- పేజీలు : 4


## కేంద్ర నిధులతో జిల్లా అభివృద్ధికి వేగం పెంచాలి

- సకాలంలో నిధుల వినియోగంపై అధికారులకు దిశానిర్దేశం
- ఆరోగ్యం, విద్య, తాగునీరు, రోడ్లపై ప్రత్యేక సమీక్ష




**నవతరం - శ్రీకాకుళం**

జిల్లా అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధులను సకాలంలో వినియోగించి ప్రజలకు గరిష్ట ప్రయోజనం చేకూర్చేలా అధికారులు బాధ్యతగా పనిచేయాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి, శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. కేంద్ర పథకాల అమలు పురోగతిని క్రమం తప్పకుండా సమీక్షిస్తూ లోటుపాట్లను వెంటనే సరిదిద్దాలని సూచించారు. శనివారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన దిశ (డిస్ట్రిక్ట్ డెవలప్మెంట్ కోఆర్డినేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ) సమావేశంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై సమగ్ర సమీక్ష నిర్వహించారు.వ్యవసాయ రంగంపై మాట్లాడుతూ ఖరీఫ్2025లో జిల్లాలో 2,27,142 మంది రైతులకు రూ.2,771.9 కోట్ల పంట రుణాలు మంజూరయ్యాయని, అలాగే పొలం బడి కార్యక్రమం కింద ఒక్కో యూనిట్‌కు 25 ఎకరాల చొప్పున రైతులకు శిక్షణలు నిర్వహిస్తూ ఇప్పటివరకు రూ.6.28 లక్షల వ్యయం జరిగినట్లు మంత్రి తెలిపారు. మట్టి ఆరోగ్య కార్డుల పంపిణీ 36,520 లక్ష్యానికి గాను 30,304 కార్డులు (82.98%) పూర్తయ్యాయని, మిగిలినవి రబీ సీజన్‌లో పూర్తిచేయాలని సూచించారు. తాగునీటి రంగంలో జల్ జీవన్ మిషన్ కింద జిల్లాలో 5,608 పనులు మంజూరయ్యాయని, వాటిలో 1,135 పనులు పూర్తయ్యాయని, మరో 2,024 పనులు ప్రస్తుతం ప్రగతిలో ఉన్నాయని మంత్రి వెల్లడించారు. అలాగే ఇప్పటివరకు 5,35,764 గృహాల్లో 2,30,381 గృహాలకు నల్లాల ద్వారా తాగునీరు అందించామని పేర్కొంటూ, మిగిలిన గృహాలకు కూడా వేగంగా కనెక్షన్లు ఇవ్వాలని ఆదేశించారు. ఆరోగ్య రంగంపై మాట్లాడుతూ రోడ్డు ప్రమాద బాధితులకు నగదు రహిత చికిత్స పథకం కింద ఒక్కో బాధితుడికి రూ.1.5 లక్షల వరకు చికిత్స సదుపాయం ఉన్నట్లు తెలిపారు. జిల్లాలో ట్రామా కేర్ సెంటర్లను ఏర్పాటు చేయాలన్నారు. క్షయ (టీబీ) నిర్మూలన కార్యక్రమంలో భాగంగా టీబీ రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రత్యేక భవనాల కేటాయింపుపై పరిశీలన చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యా రంగంపై మాట్లాడుతూ జిల్లాలో 41 పీఎం శ్రీ పాఠశాలలు మంజూరయ్యాయని, అలాగే 23 అటల్ టింకరింగ్ ల్యాబ్స్, 66 పాఠశాలల్లో పి ఎ ఎల్ ల్యాబ్స్ ద్వారా డిజిటల్ విద్యను విస్తరిస్తున్నట్లు తెలిపారు. మధ్యాహ్న భోజన పథకం కింద 721 పాఠశాలల్లో కిచెన్ గార్డెన్లు ఏర్పాటు చేసి ఒక్కో పాఠశాలకు రూ.5,000 చొప్పున నిధులు విడుదల చేసినట్లు వివరించారు.గృహ నిర్మాణ రంగంలో జిల్లాలో మొత్తం 66,127 ఇళ్లకు మంజూరు లభించగా, ఇప్పటివరకు 46,178 ఇళ్లు పూర్తయ్యాయని, ఈ పథకానికి సంబంధించి రూ.910 కోట్లకు పైగా వ్యయం జరిగినట్లు మంత్రి పేర్కొన్నారు. మిగిలిన ఇళ్లను కూడా త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. రవాణా, రోడ్లపై మాట్లాడుతూ జాతీయ రహదారులు, ఆర్అండ్‌బీ, మున్సిపల్ రహదారుల నిర్వహణలో లోపాలు లేకుండా చూడాలని, అలాగే ట్రామా కేర్ సెంటర్ల నిర్వహణ మెరుగుపడితే ప్రమాదాల్లో ప్రాణ నష్టాన్ని గణనీయంగా తగ్గించవచ్చని మంత్రి స్పష్టం చేశారు.ఈ సమావేశంలో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్ దొనక పృథ్వీరాజ్ కుమార్, జడ్పీ సీఈవోతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## జె.ఇ.ఇ అడ్వాన్స్ 2025లో శ్రీచైతన్య విద్యార్థుల ఘన విజయం

- ఓపెన్ కేటగిరిలో తొలి ర్యాంక్‌తో పాటు ఐఐటీలకు ఎంపికయ్యారు.
- కరికులం, ఉపాధ్యాయుల కృషి, విద్యార్థుల నిరంతర సాధన ఈ విజయానికి కారణం
- సన్మాన కార్యక్రమంలో విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేసిన నిర్వాహకులు



**నవతరం - శ్రీకాకుళం**

జె.ఇ.ఇ అడ్వాన్స్-2025లో జాతీయ స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన శ్రీచైతన్య విద్యార్థులకు శ్రీకాకుళం మహాలక్ష్మీ నగర్ కాలనీలోని శ్రీచైతన్య స్కూల్‌లో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఓపెన్ కేటగిరిలో తొలి ర్యాంక్ సాధించి ఐఐటీ ముంబైలో చదువుతున్న డి.జ్ఞాన రిత్విక్ సాయి, 156వ ర్యాంక్‌తో ఐఐటీ ఖరగ్‌పూర్‌లో చదువుతున్న ఎల్.చరణ్, 274వ ర్యాంక్‌తో ఐఐటీ గౌహతిలో చదువుతున్న ప్రణీత్ సాయి భరత్, 657వ ర్యాంక్‌తో ఐఐటీ గౌహతిలో చదువుతున్న రోహిత్ దత్తా, 583వ ర్యాంక్‌తో ఐఐటీ ఖరగ్‌పూర్‌లో చదువుతున్న బి.మోక్ష శ్రీ, 3200వ ర్యాంక్‌తో ఐఐటీ పాట్నాలో చదువుతున్న ఎం.వివేక్‌లను ఈ సందర్భంగా సన్మానించారు. శ్రీచైతన్య విద్యాసంస్థలు రూపొందించిన కరికులం, ప్రణాళికాబద్ధమైన బోధన, ఉపాధ్యాయుల కృషి, విద్యార్థుల నిరంతర సాధన మరియు తల్లిదండ్రుల సహకారం వల్లే ఈ ఘన విజయాలు సాధ్యమయ్యాయని నిర్వాహకులు తెలిపారు. ఈ అభినందన సభలో విద్యాసంస్థల నిర్వాహకులు, అధ్యాపకులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొని విజేతలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## రాజ్యాధికారానికి దూరంగా యాదవులు

- సామాజిక చైతన్యంలో కూడా వెనుకు బాటే..
- ఎన్నికల్లో మాత్రమే ఓటు బ్యాంకుగా వాడుకుంటున్న ప్రధాన సామాజిక వర్గ రాజకీయ పెద్దలు
- జిల్లాలో నాలుగో ప్రాధాన్యత సామాజిక వర్గమైనా గాని.. యాదవులు కరేపాకు లేనా?
- కొన్ని రాజకీయ పార్టీలు రాజకీయంగా ప్రాధాన్యత నిస్తే.. మరికొన్ని రాజకీయ పార్టీలు యాదవులను అణగదొక్కే ప్రయత్నం చేశారా!
- ఐక్యమత్యం లేకపోవడం వల్లే.. యాదవులు రాజ్యాధికారంలోకి దూరమా..
- ఇప్పుడిప్పుడే ఐక్యతపై సోషల్ మీడియాలో సామాజిక న్యాయం.. జరగాలంటూ పోస్టింగులు



4లో

## ఐతంలో ఆవిష్కర్ సీజన్-3 హాకథాన్ ఘన ప్రారంభం

ముఖ్యఅతిథి ఉప కులపతి డా. కె. రెమి రజని


2లో





## వైకుంఠ ఏకాదశికి పక్కాగా ఏర్పాట్లు చేయాలి

- భక్తుల సౌకర్యాలే ప్రభుత్వ ప్రాధాన్యత
- మంత్రి అచ్చెన్నాయుడు



**నవతరం -టెక్కలి**

వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా టెక్కలిలోని శ్రీ వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో విస్తృత ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన ఆలయాన్ని సందర్శించి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉత్తర ద్వార దర్శనం కోసం వేలాదిగా తరలివచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పటిష్టమైన క్యూలైన్లు, తాగునీరు, మౌలిక వసతుల కల్పనలో రాజీ పడకూడదని స్పష్టం చేశారు.

వేడుకల సందర్భంగా భద్రత, ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి అచ్చెన్నాయుడు అధికారులకు దిశానిర్దేశం చేశారు. భక్తుల రాకపోకలకు ఇబ్బంది లేకుండా రవాణా ఏర్పాట్లు, ప్రత్యేక దర్శనాలకు సంబంధించి ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. వైకుంఠ ఏకాదశి వేడుకలను భక్తిశ్రద్ధలతో, అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ఆర్డీవో కృష్ణమూర్తి, పీఏసీఎస్ చైర్మన్ బాగాది శేషగిరిరావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎడిటోరియల్

# పట్టాలెక్కిన పంచాయతీలు

రాష్ట్రంలోని పంచాయతీలు పరిపాలనా పట్టాలెక్కాయి. అపాయింటెడ్ డే నాడు ప్రమాణ స్వీకారం చేసిన కొత్త సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు కొలువుదీరారు. వారి అధికారాలు, విధులను గుర్తుచేస్తూ ముఖ్యమంత్రి కరదీపికను ఇటీవల ఆవిష్కరించారు. ఈసారి ఎన్నికల్లో యువత అత్యధిక స్థానాల్లో బాధ్యతల్లోకి వచ్చారు. రిజర్వేషన్లకు మించి మహిళలు గెలుపొందారు. మొత్తం గ్రామాల్లో 86.4 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీలే విజయం సాధించడం గమనార్హం. అందులోనూ ముప్పై ఒక శాతం నిరక్షరాస్యులుండగా, యాభై నాలుగు శాతం పట్టభద్రులు పంచాయతీల్లోకి అడుగుపెట్టారు. మొత్తం 12,728 గ్రామాలకుగాను 11,947 స్థానాల్లో ఎన్నికలు జరిగాయి. 1205 ఏకగ్రీమయ్యాయి. మిగతావి రకరకాల కారణాలతో పెండింగ్‌లో ఉన్నాయి. ఇదిలావుండగా రెండేండ్లు ఆలస్యంగా నైనా ఎన్నికలు నిర్వహించారు. ఒక అంకం పూర్తయింది. అసలుది ఇప్పుడే ప్రారంభమైంది. కొత్త నాయకత్వానికి పంచాయతీ ల్లోని సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. కనీసం మౌలిక వసతులకు నోచుకోని గ్రామాలు కోకొల్లలు. అంతదాక ఎందుకు పంచాయతీ భవనాల్లోనే సరైన వసతులు కరువయ్యాయి.

నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులకు గ్రామ ఖాతాల్లోని ఖాళీ ఖజానా వెక్కిరిస్తున్నది. మహిళా సర్పంచులకు ఇబ్బందులు తప్పకపోవచ్చు. సమయాను కూలంగా ఎన్నికలు జరగలేదనే కారణంగా కేంద్ర ప్రభుత్వం రూ.3500 కోట్లను ఆపేసింది. ఆర్థికలేమి పేరుతో రాష్ట్ర ప్రభుత్వమూ అరకొర నిధులే ఇస్తున్నది. గ్రామసీమలే ప్రగతి పట్టుగొమ్మలని జాతిపిత గాంధీజీ అన్న మాటలు ఇక్కడ మననం చేసుకోవాల్సిన సందర్భమిది. ఇంతకాలం ప్రత్యేకాధికారుల పాలనలో మగ్గిన పంచాయతీల పరిస్థితి 'ముందు నుయ్యి వెనుక గొయ్యి'లా తయారైంది. గ్రామాల్లో తాగునీటి సరఫరా, పారిశుధ్యం, రోడ్ల నిర్వహణ, స్ట్రీట్ లైట్లు, ప్రజారోగ్యం తదితర సమస్యలు గ్రామాలను దీర్ఘకాలికంగా పీడిస్తున్నాయి. వీటి పరిష్కారం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రావాల్సిన సాధారణ నిధులూ సమ యాను కూలంగా అందడం లేదు. దీంతో పరిస్థితులు దయనీయమయ్యాయి. కనీసం పారిశుధ్య నిర్వహణ, ఇతర అవసరాల కోసం వాడుకునే ట్రాక్టర్లల్లో డీజిల్ నింపలేని దారుణ పరిస్థితులు దాపురించాయి.

ప్రతి వ్యక్తికి రూ.900 నుంచి రూ.1400 వరకు వచ్చే పదిహేనవ ఆర్థిక సంఘం నిధులను కేంద్రం ఇప్పటికే నిలిపేసింది. కాగా మాజీ సర్పంచులు, చిన్న కాంట్రాక్టర్లు టెండర్లు తీసుకుని వడ్డీలకు తెచ్చిన సొంత డబ్బులతో అభివృద్ధి కార్యక్రమాలను చేపడితే బిల్లులివ్వకుండా ప్రభుత్వాలు సతాయిస్తున్నాయి. సుమారు రూ.2700 కోట్ల మేర బిల్లులను పెండింగ్‌లో పెట్టాయి. దీంతో వీరంతా వడ్డీవ్యాపారుల ఒత్తిళ్లను ఎదుర్కొవాల్సి వస్తున్నది. బిల్లుల సాధనకు ధర్నాలు, నిరసనలు కొనసాగుతున్నాయి. అప్పుల భారం పెరిగి పలువురు మాజీ సర్పంచులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, గ్రామీణాభివృద్ధి శాఖలోనే కాకుండా నీటిపారుదల శాఖ, మిషన్ భగీరథ, రోడ్లు, భవనాలు తదితర శాఖల్లోనూ చిన కాంట్రాక్టర్లకు ఆశనిపాతమవుతున్నది. గత సర్పంచులు మానవహక్కుల కమిషన్‌కు సైతం తమ బిల్లులను మంజూరు చేయించాలంటూ ఫిర్యాదు చేశారు. బీఆర్ఎస్ సర్కారు హయాం నుంచే ఈ బకాయిలు పేరుకుపోయాయి. ఇంకా కొన సాగుతున్నాయి. ప్రభుత్వాలు స్థానిక సర్పంచ్‌లు, చిన్నవాళ్లను కాదని పెద్ద కాంట్రాక్టర్లకు బిల్లులు మంజూరు చేస్తున్నాయనే ఆరోపణలు, విమర్శలు సైతం దీర్ఘకాలంగా ఉన్నాయి.

పంచాయతీరాజ్ చట్టం 2018 ప్రకారం పంచాయతీల విధులు, బాధ్యతలపై స్పష్టత కరువైంది. పంచాయతీల్లో సిబ్బంది లేరు. కార్యదర్శులు స్థానికంగా ఉండటం లేదనే విమర్శలు. ఇన్ని సమస్యలుండగా, ఇప్పుడు కేంద్రంలోని మోడీ సర్కారు పంచాయతీలపై పిడుగేసింది. సాధారణ ప్రజలను ఆకలికి చంపేందుకు ప్రయత్నిస్తున్నది. వామపక్షాల చొరవతో యూపీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసింది.

దాన్నిప్పుడు వీబీ జీ రామ్ జీ పథకంగా మార్చేసి నిరుపేదల నోటికాడ బువ్వను నిర్ధాక్షిణ్యంగా లాగేసుకుంది.

చట్టం ద్వారా హక్కుగా వచ్చే ఉపాధి పనులను పథకంగా మార్చేసి ప్రజలను బిచ్చగాళ్లను చేసింది. ఉపాధి చట్టం నిబంధనలను పూర్తిగా తుంగలో తొక్కి గ్రామీణపేదల బతుకులను ప్రశ్నార్థకం చేసింది. కేంద్రం 60:40 నిష్పత్తిలో ఈ పథకానికి నిధులు వెచ్చించాలంటూ షరతులు పెట్టి రాష్ట్ర ప్రభుత్వాలపై ఆర్థిక భారం మోపింది. ఇదిలావుండగా పంచాయతీలకు ఖాళీ బొక్కసాలిచ్చి కొత్త పాలకవర్గాలను తెచ్చినా పెద్దగా ప్రయోజనం ఉండదు. స్థానిక పాలన సాగదు.

## ఐతంలో ఆవిష్కర్ సీజన్-3 హాకథాన్ ఘన ప్రారంభం

**నవతరం టెక్కలి**

నేడు స్థానిక టెక్కలి ఐతం కళాశాలలో సీజన్ 3 ఆవిష్కర్ 48గంటల హకథాన్ ప్రారంభించినట్లు డైరెక్టర్ ప్రొఫెసర్ వి వి నాగేశ్వరావు తెలిపారు. ఈసందర్బంగా డైరెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆవిష్కరణాత్మక ఆలోచనలు, సృజనాత్మకత మరియు ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డా. బి.ఆర్. అంబేద్కర్ విశ్వవిద్యాలయం ఉప కులపతి డా. కె. రెమి రజని హాజరై ప్రారంభించారన్నారు. ఈ సందర్భంగా ఆమె ఐతం కళాశాల గురించి విశదంగా వివరిస్తూ ప్రసంగించారు. గ్రామీణ ప్రాంతంలో నెలకొని ఉన్నప్పటికీ, నాణ్యమైన సాంకేతిక విద్య అందిస్తూ రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతున్న కళాశాలగా ఐతం ఎదుగుతున్న తీరు అభినందనీయమని అన్నారు.,కళాశాలలో అమలవుతున్న ఆధునిక బోధనా విధానాలు, పరిశ్రమల అవసరాలకు అనుగుణమైన పాఠ్యక్రమం, పరిశోధన మరియు ఆవిష్కరణలకు ఇస్తున్న ప్రాధాన్యం, అత్యాధునిక ప్రయోగశాలలు, డిజిటల్ లెర్నింగ్ వసతులు, అనుభవజ్ఞులైన అధ్యాపక బృందం గురించి ఆమె ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఇలాంటి విద్యా వాతావరణం విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాదిగా నిలుస్తుందని తెలిపారు.

తదుపరి హాకథాన్ ప్రాముఖ్యతను వివరిస్తూ డా. కె. రెమి రజని మాట్లాడుతూ, "ఆవిష్కర్" వంటి 48 గంటల హాకథాన్ కార్యక్రమాలు విద్యార్థుల్లో పోటీతత్వం, కోడింగ్ నైపుణ్యాలు, ప్రాజెక్ట్ అభివృద్ధి సామర్థ్యం, బృందస్ఫూర్తి మరియు సమస్య పరిష్కార దృక్పథాన్ని పెంపొందిస్తాయని అన్నారు. విద్యార్థులు పుస్తక విజ్ఞానంతో పాటు ప్రాక్టికల్ నాలెడ్జ్‌ను కూడా పెంచుకోవాలని సూచించారు.

తొలి రోజు కార్యక్రమంలో హాకథాన్ నిబంధనలు, విధివిధానాలను నిర్వాహకులు వివరించారు. అనంతరం వివిధ విభాగాలకు చెందిన విద్యార్థులు బృందాలుగా ఏర్పడి తమ ఆలోచనలను ఐడియా ప్రెజెంటేషన్‌ల రూపంలో ప్రదర్శించారు. ల్యాబ్‌లు, కంప్యూటర్ సెంటర్లు విద్యార్థులతో కిటకిటలాడుతూ, కోడింగ్ మరియు డిజైన్ పనులు జోరుగా కొనసాగాయి.

ప్రిన్సిపాల్ డా. ఎ.ఎస్. శ్రీనివాసరావు మాట్లాడుతూ,షుమారు గా 10 రాష్టాలనుంచి తమిళనాడు, కర్ణాటక, గుజరాత్, తెలంగాణ, ఒడిస్సా మొదలగు రాష్ట్రాలనుండి 500 విద్యార్థి బృందలు పేర్లు నమోదు చేసుకోగా, మొదటి రోజు50 బృందాలు పాల్గొన్నా యని తెలిపారు. తొలి రోజే విద్యార్థుల్లో కనిపించిన ఉత్సాహం హాకథాన్ విజయానికి సూచికగా ఉందని పేర్కొన్నారు. విద్యార్థులు 48 గంటల పాటు సమయాన్ని సద్వినియోగం చేసుకొని వినూత్న ప్రాజెక్టులను రూపొందించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలోసొసైటీ చైర్మన్ డా కె సోమేశ్వరరావు, కార్యదర్శి ఎల్.ఎల్. నాయుడు, కోశాధికారి టి. నాగరాజు, వివిధ విభాగాల హెచ్‌ఓడీలు, అధ్యాపకులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని, తొలి రోజు కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అనంతరం వి సి తో కలసి యాజ మాన్యం, విద్యార్థులు ప్రధర్సించే ప్రాజెక్ట్ లు విక్షించారు. ఈ కార్యక్రమం నకు డీన్ ఐ ఐ సి డా జి. సతీష్ కుమార్ సమన్వయ కర్తగా వ్యవహారించారు.

# కారణజన్మురాలు గోదాదేవి చరిత- విల్లిపుత్తూరు



శ్రీమహావిష్ణువుకి అత్యంత ప్రీతికరమైనది ధనుర్మాసం, "ధనస్సంక్రాంతి మారభ్యమా పమేకం వ్రతం చరిత్" ధనర్మానపు నెలరోజులు శ్రీరంగనాధుని ఆర్చించటమే ధనుర్మాస వ్రతం. ప్రత్యక్షమైనమైన సూర్యుడు ధనస్సురాశిలోనికి ప్రవేశించినది మొదలు ధనుర్మాసం ప్రారంభమవుతుంది. సూర్యగమనాన్ని బట్టి సంవత్సరానికి పన్నెండు నెలలు.. మేషాదిగా గల రాశులూ పన్నెండు. సూర్యుడు నెలకొక రాశి చొప్పున పన్నెండు నెలలూ పన్నెండు రాశులలో ప్రవేశిస్తాడు. అతడు ఏరాశిలో ప్రవేశిస్తే ఆ ప్రవేశదినం ఆ రాశిపేరున్న సంక్రమణంగా పిలుస్తారు. ఆ క్రమంలో ధనూరాశిలోకి ప్రవేశించేరోజు ధనుస్సంక్రమణం. ఈ రోజు మొదలు మకరరాశిలో ప్రవేశించే రోజు (మకర సంక్రాంతి) వరకు ఉన్న నెలరోజులూ ధనుర్మానంగా ప్రసిద్ధం.

ధనుర్మాసం నుండి మకర సంక్రాంతి వరకు స్త్రీలు తెలవారుజామునే లేచి ఇంటి ముంగిట ఆవుపేడతో కళ్ళాపిచల్లి రంగు రంగుల రంగవల్లులు తీర్చిదిద్దుతారు. వాటి మీద ఆవుపేడతో తయారుచేసిన అందమైన గొబ్బెమ్మలు పెట్టి, బంతిపూలు, గుమ్మడిపూలతో అలంకరిస్తారు. ఈ ధనుర్మాసమంతా ఇలా చేసి సంక్రాంతికి ముందు రోజు ఆవుపిడకలతో భోగి మంటలు వేస్తారు. స్వచ్ఛమైన భోగి మంటలు ఇవే. పనికిరాని వస్తువులతో, చెత్తాచెదారంతో వేసికొనేవి భోగిమంటలు కాదు. వాతావరణ పరిరక్షణకు విఘాతం. ధనుర్మాసంలో శ్రీమహావిష్ణువుని ఆరాధించటం అనాదిగా వస్తున్న సంప్రదాయం. గోదాదేవి ఆత్మతత్త్వ అనుభూతి ప్రేరకంగా పాశులతో శ్రీరంగనాధుని కీర్తించింది. తిరుప్పావై అంటే దివ్యమైన వ్రతం లేదా భాగవతంలోని శ్రీ కాత్యాయనీ వ్రతం. గోదాదేవి నిద్రాముద్రితరాలైన అజ్ఞాన జీవులను మేల్కొల్పుతుంది. ధనుర్మాసంలో గోదాదేవి పాశు రాలతో భగవంతుని మేల్కొల్పే భక్తి సంప్రదాయమై వుంది. ఈ ఆరాధన వల్ల మనిషిలో ఒక విధమైన క్రమశిక్షణ అలవడుటమేగాక మానసిక శాంతి లభిస్తుంది. తమిళనాడు రాష్ట్రంలో మధురై నగరానికి సుమారు యాభై మైళ్ళ దూరంలో 'శ్రీవిల్లి పుత్తూరు' అనే గ్రామం వుంది. విల్లిరాజు పరిపాలించిన ఊరు కనుక ఆ రాజు పేరు వచ్చింది. ఆ ఊరిలో ముకుందాచార్యులు పద్మవతీ పుణ్యదంపతులకు భట్టనాధుడు అనే కుమారుడు జన్మించాడు. విష్ణుభక్తుడైన అతనికి విష్ణుచిత్తుడు అని పేరు. విష్ణుచిత్తుడు ప్రతిరోజూ తులసి మాలలను దేవుడికి సమర్పించి పూజలు చేయడంతోపాటు "తిరుప్పలాణ్ణు" అనే పేరుతో 12 పాటలు వ్రాసి వాటిని గానం చేస్తూ స్వామివారిని అర్చిస్తూ వుండేవాడు. ఇతడు గరుత్మంతుని అంశచే జన్మించిన వాడగుటచేత గరుడాళ్వారు అని, పెరియాళ్వారు అని పిలిచేవారు. 'ఆళ్వారు' అంటే భగవంతుని శరణాగతి చేసి, ఆ భగవదారాధనలో నిరంతరం మునిగి ఉండేవాడని అర్థం.

"కర్కాట పూర్వ ఫల్గుణ్యాం తులసీకా నవోద్భవామ్ / పాండ్య విశ్వంభరా దేవీం వందే శ్రీరంగనాయకమ్" అని కర్కాటక మాసంలో, పూర్వ ఫల్గుణీ నక్షత్రంలో భూదేవి అంశంతో శ్రీదేవి రూపంగా తులసీవనంలో విష్ణుచిత్తుడనే విష్ణుభక్తునికి, అలనాడు జనకునికి సీతాదేవి లభించినట్లుగా ఓ అందాలపాప లభించింది. ఆ పాపను భగవంతుని ప్రసాదంగా భావించిన విష్ణుచిత్తుడు 'కోదై' అని నామకరణం చేశాడు. 'కోదై' అంటే పూలమాల అని అర్థం. అల్లారుముద్దుగా పెరిగిన ఆ పాపే 'గోదాదేవి'గా సుప్రసిద్ధమైంది. 'గో' అంటే జ్ఞానమనీ, 'ద' అంటే ఇచ్చుననీ అర్థం. జ్ఞానప్రదాతయైన గోదాదేవి కారణజన్మురాలు.

చిన్ననాటి నుండి భగవంతుని గుణాలను ఎంతో ఆసక్తిగా విష్ణుచిత్తుని నుండి, కృష్ణుని లీలానుభూతులను తెలుసుకొనే తన బిడ్డ భక్తిని చూసి పొంగిపోయిన పెరియాళ్వారు తన కూతురిని భూదేవి అవతారంగా భావించి ఆనందించేవాడు. గోదాదేవిలో ఉన్న భక్తి వయస్సుతోపాటు పెరిగి ప్రేమగా మారింది. శ్రీకృష్ణుడే తన భర్త అని భావించింది. విష్ణుచిత్తుడు దేవుడి కోసం కట్టె పూ, తులసీమాలలను గోదా ధరించి ప్రతిబింబాన్ని చూసుకొని మురిసిపోయేది. ఒకనాడు భగవంతుడికి అలంకరణ చేస్తుండగా విష్ణుచిత్తునికి పూలమాలలో తల వెంట్రుక కనిపించింది. ఈ విషయం గోదాదేవితో తెలిసికొన్నవాడై, ఎంత అపచారం తన కుమార్తె ధరించిన మాలలను భగవంతునికి సమర్పించడం, గోదా చేసిన పనికి మనసు బాధపడింది. ఆ రోజు స్వామివారికి మాలా కైంకర్యం చేయకుండానే నిద్రలోనికి జారుకొన్నాడు.

స్వప్నంలో స్వామి సాక్షాత్కరించి "విష్ణుచిత్తా! గోదాదేవి సాక్షాత్తు భూదేవి అవతారమే ఆమె ధరించి ఇచ్చిన మాలలే నాకు అత్యంత ప్రీతిపాత్రమైనవి. వాటిని ధరింపచేయమని చెప్పగా ఆనందభరితుడై తన కుమార్తెను 'ఆండాల్' అని పిలిచాడు. 'ఆండాల్' అంటే కాపాడునది. తల్లి అని అర్థం. మాధవుడికి కట్టిన పూలమాలలను ముందుగా తాను ధరించి, ఆయన కొసంగడంతో "శూడి కొడుత్తనాచ్చియార్" అని పిలువబడింది గోదాదేవి. ద్వాపరయుగంలో శ్రీకృష్ణుని ఎడబాటుకు తాళలేక గోపికలు 'ఏవిధంగా 'కాత్యాయనీ' వ్రతం చేశారో అలాగే ఆండాళ్ళు కూడా 'మార్గళి' నోము నోచి 'తిరుప్పావై' 'నాచ్చియార్ తిరుమొళి' అనే రెండు ప్రబంధాలను రచించింది.

యుక్తవయసు వచ్చిన గోదాదేవి తండ్రి విష్ణుచిత్తునితో 'నేను పెరుమాళ్ళ'ను మాత్రమే వివాహం చేసుకుంటానని చెప్పగా, విగ్రహరూపుడైన శ్రీరంగనాధుడు అండాళ్ళను వివాహమడతాడా అని దిగులు పడగా 'కలలో ఓ రోజు శ్రీరంగనాధుడు కనబడి' 'మీరంతా మంగళవాద్యాలతో శ్రీవిల్లి పుత్తూరుకు వెళ్ళి. పల్లకీలో ఆండాళ్ళను ఎక్కించుకుని తీసుకురమ్మని ఆజ్ఞాపించాడు. ఆయన చెప్పినట్లే ఆండాళ్ళను శ్రీరంగానికి తీసుకువెళ్ళాడు విష్ణుచిత్తుడు. సమస్త భక్తజనం చూస్తుండగా స్వామివారి దివ్యదేహంలో లీనమైంది గోదాదేవి. భక్తజనులను తరింపచేసేందుకు, తాను మార్గదర్శకురాలై, ఈ ధనుర్మాస వ్రతాన్ని ఆచరించి చూపింది గోదాదేవి.

ఈ పవిత్ర దినమునే 'భోగి' అని వ్యవహరించబడింది. 'భోగి' అంటే భగవంతుడికి చేయు పూజాదికములనీ, 'భోగము' అనగా పరమాత్మానుభవము. ఆనాటి నుంచి భోగి రోజున శ్రీవైష్ణవాలయాల్లో శ్రీ గోదారంగనాధుల 'కళ్యాణం' జరపటం సాంప్రదాయంగా మారి 'భోగి' పండుగను జరుపుకుంటున్నాము.

ఈ ధనుర్మాసములో అన్నీ శ్రీవైష్ణవ దేవాలయాలలో ఆండళ్ తిరుప్పావై జరుపుతారు. 'తిరు' అంటే 'శ్రీ' అని, 'పావై' అంటే 'వ్రతము' అని తిరుప్పావై గొప్పదైన వ్రతము అనిభావం. ఈ ధనుర్మాసంలో గోదా గానం చేసిన 'తిరుప్పావై'లోని ముప్పది పాశురాలను క్రమము తప్పకుండా పారాయణము చేసుకోవడం లేదా మొదటి పాశురాన్ని, చివరి పాశురాన్ని పఠించినా పుణ్యం లభించి, శ్రీరంగనాధుని దర్శించిన భాగ్యం కలుగుతుందని శ్రీనారద వచనం. ప్రతి పాశురంలోనూ ఒక విశిష్టతను సంతరించుకొన్న తిరుప్పావై ధర్మ, అర్థ, కామ, మోక్షములనే చతుర్విధ పురుషార్థాలను తనలో నిక్షిప్తం చేసుకొంది. నేటికి ఆమె చరిత్రను, కీర్తనలను భక్తులు గానం చేస్తూ వుంటారు. జీవాత్మ పరమాత్మ ఐక్యం చెందే లక్ష్యంగా సాగిన తిరుప్పావైలో భారత, భాగవత, భగవద్గీతలోని తత్త్వరహస్యములన్నియు కలవు. శ్రీవైష్ణవ సంప్రదాయంలో తలమానికం తిరుప్పావై పఠనం, మార్గశిరంలో వైష్ణవ దేవాలయాలలో, గృహాలలో, ధనుర్మాసంలో గోదా పాశురాలను గానం చేస్తే సుఖ సంతోషాలు కలుగుతాయని, తనువు చాలించిన పిదప విష్ణుపద ప్రాప్తి కలుగుతుందని విష్ణుపురాణోక్తి,

శ్రీ విల్లిపుత్తూరులో వట పత్రశాయి ఆలయం మూడు భాగాలు మనకు దర్శనమిస్తాయి. ఉత్తర భాగంలో విష్ణువు, దక్షిణ భాగంలో ఆండాల్ ఈ రెండు ఆలయాల మధ్య తులసీవనం ఉంది. ముఖ్యంగా గోదాదేవి ఉపయోగించిన బావి ఈనాటికి ఉండడమే కాకుండా ఈ బావిలోని నీరు ఎప్పటికీ తరగదు. ఈ బాని వీటిని 'దర్పణతీర్థం'గా భావిస్తారు. 788వ సంవత్సరంలో నిర్మాణం జరుపుకున్న ఈ ఆలయం ఈనాటికి శోభాయ మానంగా ఉంది. ఆలయాన్ని దర్శించి, గోదాదేవిని స్మరించి, తరిద్దాం!

"ఉదితముదార గుణరంగనాయక ప్రియవల్లభాం వసుమతీ ముపాస్మహే"



" కావ్యసుధ "
'వాఙ్మయ భూషణ'
" సాహితీ శిరోమణి "
" కవన సాగర "
'ఆధ్యాత్మిక సాహిత్య సామ్రాట్'
" ఆధ్యాత్మిక సాహితీ వ్యాస భూషణ్ "
9247313488 :
హయత్ నగర్ :
హైదరాబాదు

# ఏది నిజమైన క్రిస్మస్ పర్వదినం..?

వినుడి వినుడి
ఓ విశ్వాసులారా..!
పశువుల పాకలో శిశువుగా
బాలయేసు జన్మించిన వేళ...
నింగిలో ఓ నక్షత్రం
నవ్వుతూ దారి చూపగా...
ముగ్గురు జ్ఞానులు మురిసిపోయే..
పశువుల కాపరులు పరవశించే...!

ఓ విశ్వాసులారా..!
ఆలకించండి...ఆలోచించండి...
మీరు క్రిస్మస్ పర్వదినాన్ని
ఘనంగా జరుపుకునే ముందు...

ఇంటిల్లిపాది కొత్త వస్త్రాలు ధరించి,
ముసిముసి నవ్వుల్తో మురిసే
ముందు...
మీ పాత బట్టలతోనైనా
కొన్ని అనాధ హృదయాల్ని
హత్తుకోండి..!

రుచికరమైన పిండివంటల్ని
ఆస్వాదించే ముందు
వీధుల్లో ఆకలితో అలమటించే
అస్థిపంజరాల కడుపులు
నింపండి...

చర్చిలో పాటలు పాడే ముందు,
కష్టజీవుల కన్నీటిగాథల్ని
గుర్తుచేసుకోండి

మీరు నిత్యం పవిత్ర గ్రంథం
బైబిల్ పఠించే ముందు...

"నీ తల్లిదండ్రులను గౌరవించు,
"నరహత్య చేయవద్దు,
"దొంగతనం చేయవద్దు,
"అబద్ధసాక్ష్యం పలకవద్దు,

"నీ పొరుగువాని భార్యనైనను
"మరి దేనినైనను ఆశించవద్దు,
"నీ శత్రువులను ద్వేషించవద్దు,
"నిన్నువలె నీ పొరుగువాన్ని
ప్రేమించు..."

"ఎదుటివాని కంట నలుసు
తొలిగించే
"ముందు నీ కంట్లో దూలాన్ని
తొలగించుకో
"ఏ తప్పు చేయనివారే "
ముందు రాయిని విసరాలి...
"ఒకడు ఒక స్త్రీని మోహంతో
చూశాడంటే
"అప్పుడే వాడు తన హృదయమందు
"ఆమెతో వ్యభిచారించినవాడగును...

"ధనవంతుడు
పరలోకరాజ్యం చేరుటకన్న
"సూది బెజ్జంలో ఒంటె
దూరుట సులభం
"విశ్వాసంతో పర్వతాల్ని
కదిలించవచ్చు
అన్న బంగారు వాక్యాలను
ఆచరించండి:

ప్రతి ఆదివారం
చర్చిని దర్శించే
ముందుగా...
ఓ అనాధాశ్రమాన్ని
దర్శించండి...
ఆ విధివంచితుల ఆకలి
తీర్చండి...
ఆ అభాగ్యులను అక్కున
చేర్చుకోండి...

అదే నిజమైన క్రీస్తు సేవంటే...
అదే నిజమైన క్రిస్మస్
పర్వదినమంటే...

అప్పుడు
ఆ లోకరక్షకుడు...
ఆ ప్రేమామయుడు...
ఆ కరుణామయుడు ప్రభువైన
యేసుక్రీస్తు తన కృపావరాలైన...

చిరునవ్వుల్ని...
సిరిసంపదల్ని...
శాంతి...సౌఖ్యాలను...
ఆరోగ్యం...ఆనందం...
దీర్ఘాయుష్షు...లను...
దివ్యమైన దీవెనల్ని...
మీపై మీ కుటుంబ సభ్యులపై
కుంభవర్షంలా కురిపించును గాక..!



కవి రత్న
సాహిత్య ధీర,
సహస్ర కవి భూషణ్,
**పోలయ్య కూకట్లపల్లి,**
అత్తాపూర్, హైదరాబాద్

# ఈ నెల 31నే ఎన్టీఆర్ భరోసా ఫించన్లు పంపిణీ



## జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

(నవతరం - శ్రీకాకుళం

ఈ నెల 31వ తేదీన ఎన్టీఆర్ భరోసా ఫించన్లు పంపిణీ చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. జనవరి 1వ తేదీన పంపిణీ చేయవలసిన పించన్లు నూతన సంవత్సరం దృష్ట్యా అవ్వాతాతలకు డిసెంబర్ 31వ తేదీన ఎన్టీఆర్ భరోసా పించన్లు పథకం ద్వారా పించనుదారులకు పించన్లు పంపిణి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు వివరించారు. జిల్లాలో పెన్షన్ లబ్దిదారులందరూ ఈ విషయాన్ని గమనించవలసినదిగా ఆయనూ ప్రకటనలో పేర్కొన్నారు.

# ఎంజీఎన్ఆర్ఈజీఎస్ చట్టాన్ని రక్షణకు ఉద్యమించాలి



(నవతరం - శ్రీకాకుళం

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం రక్షణకు ఐక్యంగా ఉద్యమించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి గోవిందరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకురాలు ఎస్.కృష్ణవేణి, కాంగ్రెస్ పార్టీ నాయకురాలు కేవీఎల్ఎన్.ఈశ్వరి డిమాండ్ చేశారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో కె. మోహన్ రావు అధ్యక్షతన శనివారం జరిగిన అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడుతూ, కోట్లాదిమంది పేదలకు తోడుగానున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి కేంద్ర ప్రభుత్వం రాం రాం పలికిందని, ఈ పథకం స్థానంలో జీ రాం జీ పేరుతో కొత్త చట్టం చేసిందని, ఇది కేవలం పేరు మార్పు మాత్రమే కాదని, గతంలో 90 శాతం నిధులు కేంద్ర ప్రభుత్వం అందజేస్తోండగా, ఇప్పుడు 60 శాతం నిధులు కేంద్రం, 40 శాతం రాష్ట్ర ప్రభుత్వాలు ఇవ్వాలని, మొత్తం ఖర్చు జరిగిన తరువాత కేంద్రం 60 శాతం నిధులు ఇస్తుందని చెప్తుందని, ఇది రాష్ట్రాలపై తీవ్రమైన ఆర్థిక భారం వేసి ఈ పథకం నిర్వీర్యం చేసేందుకేనన్నారు. టీడీపీ, జనసేన పార్టీల మద్దతు లేకుండా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఒక్కరోజు దేశాన్ని పాలించలేదని విమర్శించారు. కీలక మద్దతుదారులుగానున్న ఈ రెండు పార్టీలు ఈ వినాశకర బిల్లును ఎందుకు వ్యతిరేకించడం లేదని వారు ప్రశ్నించారు. గత 11 సంవత్సరాలకు పైగా కేంద్రంలో అధికారంలోనున్న బీజేపీ తమ మాతృ సంస్థ ఆర్ఎస్ఎస్ మతతత్వ అజెండాను అమలు చేయడమే లక్ష్యంగా పనిచేస్తుందని, అందుకే పేరు మార్చి తద్వారా కార్పొరేట్లకు నమ్మకంగా సేవ చేస్తోందని ఆరోపించారు. కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాలకు గతంలో వ్యవసాయ చట్టాలు తెచ్చి భంగపడిన బీజేపీ ప్రభుత్వం ఇప్పుడు లేబర్ కోడ్స్ తెచ్చిందని, ఉపాధి చట్ట సవరణ చేస్తుందని, అటవీ చట్టాలను మార్చివేసిందని వారన్నారు. చట్టం స్ఫూర్తిని దెబ్బతీసి గ్రామీణ కూలీల ఆర్థిక, సాంఘిక జీవితంలో కొన్ని మార్పులు తీసుకువచ్చేందుకు ఈ చట్టం ఎంతగానో తోడ్పడిందన్నారు. గత 18 సంవత్సరాలుగా ఈ పథకం గ్రామీణ వలసలను తగ్గించిందని, సన్న, చిన్న కారు రైతుల భూములు అభివృద్ధి చెందాయన్నారు. రైతుల వ్యవసాయ అభివృద్ధికి ముఖ్యంగా కరవు ప్రాంతాల్లో ఉద్యాన పంటల విస్తరణకు ప్రధాన కారణమైందన్నారు. గ్రామాల్లో రోడ్లు, మురుగు కాల్వలు, పంచాయతీ, అంగన్‌వాడీ భవనాలు వంటి మౌలిక సౌకర్యాలు కొంత మేరకైనా మెరుగుపడేందుకు ఈ పథకం నిధులు తోడ్పడ్డాయని పేర్కొన్నారు. ఇంతటి కీలకమైన ఉపాధి హామీ పథకాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తన సంఖ్యా బలంతో బుల్డోజ్ చేసి ప్రజా హక్కులను కాలరాసి గుండెకాయ వంటి హక్కును మార్చేసిందన్నారు. అనకాపల్లి జిల్లా రైతు సంఘం జిల్లా కార్యదర్శి అప్పలరాజుపై పీడీ యాక్ట్ పెట్టి అక్రమంగా అరెస్టు చేయడాన్ని రౌండ్ టేబుల్ సమావేశం తీవ్రంగా ఖండించిందన్నారు.

# పతంగ్.. ఎగిరింది కానీ

**'పతంగ్' మూవీ రివ్యూ**
రేటింగ్- 2.5/5
**నటీనటులు:** ప్రీతి పగడాల- ప్రణవ్ కౌశిక్- వంశీ పూజిత్- గౌతమ్ వాసుదేవ్ మీనన్- ఎస్పీ చరణ్- అను హాసన్- శివన్నారాయణ తదితరులు
**సంగీతం:** జోస్ జిమ్మీ
**ఛాయాగ్రహణం:** శక్తి అరవింద్
**నిర్మాతలు:** విజయ్ శేఖర్ అన్నె- సంపత్ మాక- సురేష్ రెడ్డి కొత్తింటి
**రచన-దర్శకత్వం:** ప్రవీణ్ ప్రత్తిపాటి

ఏడాదిలో చివరి వీకెండ్ అయిన క్రిస్మస్ కానుకగా చాలా సినిమాలే రేసులో నిలిచాయి. వాటిలో 'పతంగ్' అనే చిన్న సినిమా కూడా ఉంది. వెరైటీ టైటిల్ కు తోడు.. ఇంట్రెస్టింగ్ ప్రోమోలతో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించిన ఈ చిత్రం ఈ రోజే ప్రేక్షకుల ముందుకు వచ్చింది. దీని విశేషాలేంటో చూద్దాం పదండి.

కథ: విష్ణు కృష్ణ అలియాస్ విస్కీ (వంశీ పూజిత్).. అరుణ్ (ప్రణవ్ కౌశిక్) చిన్ననాటి నుంచి స్నేహితులు. ఒకరంటే ఒకరికి చాలా ఇష్టం. విస్కీకి చదువు అబ్బక పానీపూరి బండి నడిపిస్తుంటాడు. అరుణ్ బీటెక్ పూర్తి చేసి జీఆర్ఈ కోసం ట్రై చేస్తుంటాడు. విస్కీ.. ఐశ్వర్య (ప్రీతి) అనే అమ్మాయితో ప్రేమలో పడతాడు. తర్వాత ఆమెను అరుణ్ సహా అందరికీ పరిచయం చేస్తాడు. ఓ సందర్భంలో అరుణ్ తో కలిసి ట్రావెల్ చేసే క్రమంలో ఐశ్వర్య అతడికి దగ్గర అవుతుంది. అరుణ్ కూడా ఆమెను ఇష్టపడతాడు. కానీ విస్కీ విషయంలో ఏం చేయాలో తెలియక ఇద్దరూ సంఘర్షణకు గురవుతారు. మరి వీరి ప్రేమ గురించి విస్కీకి తెలిసిందా.. తెలిస్తే అతనెలా స్పందించాడు.. ఇంతకీ ఈ ముక్కోణపు ప్రేమకథ చివరికి ఏ మలుపు తిరిగింది.. అన్నది మిగతా కథ.




కథనం-విశ్లేషణ: అప్పటికే నిశ్చితార్థం అయి పెళ్లికి సిద్ధంగా ఉన్న అమ్మాయి.. మరో అబ్బాయి ప్రేమలో పడే కథతో రెండు దశాబ్దాల కిందట 'నువ్వు నాకు నచ్చావ్' సినిమా తీసి దానికి 'ది న్యూ లవ్ స్టోరీ' అని ట్యాగ్ పెట్టారు. అప్పటికి సమాజంలో ఉన్న పరిస్థితులు.. అప్పుడొస్తున్న కథలతో పోలిస్తే అది నిజంగా న్యూ లవ్ స్టోరీనే. కానీ ఇప్పుడు పరిస్థితులు ఎలా ఉన్నాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఒక వ్యక్తితో ప్రేమ లేదా పెళ్లి బంధంలో ఉన్నా.. ఇంకో వ్యక్తికి ఆకర్షితులు కావడంలో తప్పేమీ లేదనే మైండ్ సెట్ ఇప్పటి యువతలో చాలామందిలో వచ్చేసింది. తెరమీద ఇలాంటి కథలు కూడా బోలెడన్ని చూస్తున్నాం కూడా. ఇలాంటి టైంలో ఇద్దరు ప్రాణ స్నేహితుల్లో ముందు ఒకరితో ప్రేమలో పడ్డ అమ్మాయి.. మధ్యలో ఇంకొకరికి ఆకర్షితురాలయ్యే స్టోరీతో తెరకెక్కిన చిత్రం.. పతంగ్. ట్రెండీ క్యారెక్టర్లు.. సన్నివేశాలు.. డైలాగులతో ఈ కథను ముక్కోణపు ప్రేమకథను బాగానే నడిపించాడు కొత్త దర్శకుడు ప్రవీణ్ ప్రత్తిపాటి. కాకపోతే ఇందులో లాజిక్కుకు అందని.. జీర్ణించుకోలేని కొన్ని అంశాలు ప్రేక్షకులను డోలాయమానంలో పడేస్తాయి. ఒక అబ్బాయితో రిలేషన్షిప్ లో ఉండగానే ఇంకొక అబ్బాయికి అమ్మాయి ఆకర్షితురాలైంది అంటే.. మొదటి అబ్బాయి కంటే రెండో అబ్బాయి ఎక్కువ ఇష్టమనే కదా? మరి ఈ ఇద్దరిలో ఎవరిని ఎంచుకోవాలనే కన్ఫ్యూజన్ ఏం ఉంటుంది? ఇద్దరికీ ఒక పోటీ పెట్టి అందులో గెలిచిన వాళ్లకే ఆ అమ్మాయి దక్కుతుంది అంటే.. ఈ ముగ్గురూ ఈ పోటీకి అంగీకారం తెలపడమే చాలా విడ్డూరంగా అనిపిస్తుంది. హీరోయిన్ తండ్రో మరొకరో పెట్టిన కండిషన్ మేరకు హీరో ఓవైపు.. విలన్ ఓవైపు నిలబడి ఒక పోటీలో తలపడడం ఎన్నో కథల్లో చూశాం. అది లాజికల్ గా అనిపించే విషయం. కానీ 'పతంగ్'లో తన ముందు ఆప్షన్లు ఉన్నపుడు ఏదో ఒక నిర్ణయం తీసుకోలేక ఇబ్బంది పడే మనస్తత్వం ఉన్న అమ్మాయిగా కథానాయిక పాత్రకు ఒక జస్టిఫికేషన్ ఇచ్చినా సరే.. జీవిత భాగస్వామిని ఎంచుకునే విషయంలో ఆమె ఇలా పోటీకి ఓకే చెప్పడం విడ్డూరంగా అనిపిస్తుంది. ఇటు మొదటి అబ్బాయితో ఆమె ప్రేమలో పడడానికి దారి తీసే సన్నివేశాలు కానీ.. అటు రెండో అబ్బాయి వైపు ఆమె ఆకర్షితురాలయ్యే సీన్లు కానీ ఏమాత్రం బలంగా అనిపించవు. హీరోయిన్ పరిణతి లేని అమ్మాయి అని.. తనకు డెసిషన్ మేకింగ్ రాదని.. జస్టిఫై చేయడానికి చూసినా సరే.. ఇందులో సన్నివేశాలు సిల్లీగానే అనిపిస్తాయి. కథకు ఎంతో ముఖ్యమైన సన్నివేశాలను ఇలా మరీ తేలిగ్గా చూపించడం వల్ల 'పతంగ్' సినిమాను సీరియస్ గా తీసుకోలేని పరిస్థితి. కాకపోతే చాలా వరకు లైట్ హార్టెడ్ వినోదంతో దీన్ని ఒక టైంపాస్ ఎంటర్టైనర్ లాగా నడిపించడంలో మాత్రం రైటర్ కమ్ డైరెక్టర్ ప్రవీణ్ ప్రత్తిపాటి విజయవంతం అయ్యాడు. ఎక్కువ హడావుడి లేకుండా సింపుల్ సీన్లతో.. ట్రెండీ డైలాగులతో ప్లెజెంట్ ఫీల్ ఇస్తూ సాగుతాయి ఇందులో సన్నివేశాలు. రెండో వ్యక్తితో హీరోయిన్ ప్రేమలో పడ్డాక ఆ ఇద్దరూ అనుభవించే సంఘర్షణ.. విషయం బయటపడ్డాక స్నేహితులిద్దరి మధ్య జరిగే ఘర్షణ వరకు 'పతంగ్' ఆసక్తికరంగా సాగుతుంది. కానీ హీరోయిన్ని గెలవడానికి పతంగుల పోటీ అనగానే చాలా ఆడ్ గా అనిపిస్తుంది. దాని ఫాలోఅప్ సీన్లు కూడా విసుగు పుట్టిస్తాయి. కానీ చివర్లో ఓ నలభై నిమిషాల పాటు స్పోర్ట్స్ డ్రామాను ఆసక్తికరంగానే నడిపించారు. పతాక సన్నివేశాలు కూడా బాగున్నాయి. ముగింపు సన్నివేశాలను పరిణతితో తీర్చిదిద్దారు. కానీ ఈ కథను మలుపు తిప్పే పాయింటే ఇల్లాజికల్ గా అనిపిస్తుంది. సుదీర్ఘ నిడివి కూడా 'పతంగ్'కు మైనస్ అయింది. ప్లాట్ పాయింటుని ఇంకొంచెం కన్విన్సింగ్ గా చెప్పగలిగి ఉంటే.. నిడివి తగ్గించి ఉంటే 'పతంగ్' మంచి ఫీలింగ్ ఇచ్చేది. కానీ ఇప్పుడు మాత్రం మిక్స్డ్ ఫీలింగే కలుగుతుంది.

నటీనటులు: ముఖ్య పాత్రధారులందరూ కొత్త వాళ్లే అయినా బాగా చేశారు. సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్ అయిన ఎన్నారై అమ్మాయి ప్రీతి పగడాల క్యూట్ గా కనిపిస్తూ.. నటిస్తూ ఆకట్టుకుంది. పాత్రకు తగ్గట్లుగా తన నటన సాగింది. విస్కీ పాత్రలో వంశీ పూజిత్ యూత్ నచ్చే లుక్.. స్టైల్.. యాక్టింగ్ తో మెప్పించాడు. ప్రణవ్ కౌశిక్ కూడా బాగా చేశాడు. దర్శకుడిగా తన ఒరిజినల్ క్యారెక్టర్లోనే నటించిన గౌతమ్ వాసుదేవ్ మీనన్ ఈ సినిమాకు ఆకర్షణగా మారాడు. ఆయన వల్ల సినిమా లెవెల్ మారింది. తనకు ప్రీతికి మధ్య సాగే కాన్వర్జేషన్లు ఆకట్టుకుంటాయి. ఎస్పీ చరణ్..
అను హాసన్.. పాత్రలు వారి నటన జస్ట్ ఓకే అనిపిస్తుందంతే. సహాయ పాత్రలు పోషించిన వాళ్లంతా బాగానేచేశారు.

సాంకేతిక వర్గం: టెక్నికల్ గా 'పతంగ్' మెరుగ్గా అనిపిస్తుంది. జోస్ జిమ్మీ ట్రెండీ పాటలు అందించాడు. అవి హుషారుగా అనిపిస్తాయి. పాటలకు సరదాగా సాగే సాహిత్యం అందించారు. నేపథ్య సంగీతం కూడా బాగుంది. ఇండీ స్టయిల్లో సాగే సినిమాకు అందుకు తగ్గ ఛాయాగ్రహణమే అందిచాడు శక్తి అరవింద్. నిర్మాణ విలువలు సినిమాకు అవసరమైన స్థాయిలో ఉన్నాయి. చిన్న సినిమా అయినప్పికీ.. గాలిపటాల పోటీల్లో వీఎఫెక్స్ బాగా చేసుకున్నారు. రైటర్ కమ్ డైరెక్టర్ ప్రవీణ్ ప్రత్తిపాటిలో విషయం ఉంది. ముక్కోణపు ప్రేమకథలో గాలి పటాల పోటీ నేపథ్యంలో అతను ఎంచుకున్న కథాంశం లైన్ పరంగా ఆసక్తికరంగానే అనిపిస్తుంది. కానీ ఈ పాయింటుకి ఆసక్తికర స్క్రీన్ ప్లే జోడించలేకపోయాడు. కన్విన్సింగ్ గా అనిపించేలా తెరపై ప్రెజెంట్ చేయడంలో తడబడ్డాడు. ఐతే కొన్ని ఎపిసోడ్లను అతను బాగా డీల్ చేశాడు. ప్లెజెంట్ ఫీల్ ఇచ్చేలా సన్నివేశాలను కన్సీవ్ చేసిన తీరు ఆకట్టుకుంటుంది.

# పొన్నాడ జెడ్పీ హైస్కూల్‌కు 12 తేజ్కమల్ కుర్చీల విరాళం

- ఉపాధ్యాయుల వినియోగార్థం దంత వైద్యుడి సేవాభావం
- విద్యా సంస్థల అభివృద్ధికి ముందుకొచ్చిన వైద్యుడు సతీష్ కుమార్




(నవతరం ఎచ్చర్ల)

ఎచ్చర్ల మండలం పొన్నాడ గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ హై స్కూల్ ఉపాధ్యాయ సిబ్బంది వినియోగార్థం శ్రీకాకుళం పట్టణం కళింగరోడ్డు మార్కెట్ సమీపంలో ఉన్న శ్రీ ధనలక్ష్మీ దంత వైద్యశాల వైద్యుడు శిల్లా సతీష్ కుమార్ 12 తేజ్కమల్ కుర్చీలను విరాళంగా అందజేశారు. పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ కుర్చీలను ప్రధానోపాధ్యాయిని లాడి అమ్మాజీకి అందజేశారు. ఉపాధ్యాయులు రోజూ ఎదుర్కొనే సౌకర్యాల లోటును దృష్టిలో ఉంచుకుని ఈ విరాళం అందించడం అభినందనీయమని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. విద్యా సంస్థల అభివృద్ధికి సమాజంలోని ప్రతి ఒక్కరూ సహకరించాలని ఈ సందర్భంగా పలువురు అభిప్రాయపడ్డారు.
ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది టి. బాల కృష్ణ కుమార్, వి.వి. రమణ మూర్తి, బి. గృహలక్ష్మి, సి. హెచ్. సుజాత, ఎం. సుశీల, ఎం. విష్ణు, బి. సతీష్, ఎస్. విమల, సి. హెచ్. శ్రీనివాసరావు, ఎం. లక్ష్మి పాల్గొని సేవాభావంతో ముందుకు వచ్చిన వైద్యుడికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

# వ్యవసాయ, పారిశ్రామిక వృద్ధిపై ప్రత్యేక దృష్టి

## కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

**నవతరం - శ్రీకాకుళం**

కేంద్ర నిధులను వినియోగించుకుంటూ.. శ్రీకాకుళం జిల్లాలో ప్రధానంగా వ్యవసాయం, పారిశ్రామిక వృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. శనివారం నాడు శ్రీకాకుళం జెడ్పి సమావేశ మందిరంలో జిల్లా అభివృద్ధి సమన్వయము, పర్యవేక్షణ కమిటి (దిశ) సమావేశం రామ్మోహన్ నాయుడు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రోడ్ సేఫ్టీ, వ్యవసాయం, పౌర సరఫరాలు, నాబార్డ్, డ్వామా, రూరల్ వాటర్ స్కీం, ఆరోగ్య, మైనింగ్, విద్య, సమగ్ర శిక్ష, మున్సిపాలిటి శాఖల అధికారులతో జిల్లాలో అభివృద్ధి నివేదికలపై సమగ్రంగా చర్చించారు. ఇంతవరకు చేసిన పనుల ప్రస్తుత స్థితిని, భవిష్యత్ పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా పలు సూచనలను కేంద్ర మంత్రి చేశారు. తొలుత రవాణా శాఖకు సంబంధించి జిల్లాను ప్రమాద రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. ఇందుకోసం అందరిలో కూడా విస్తృతంగా అవగాహనా కార్యక్రమాలు రూపొందించాలని కోరారు. ఇదివరకు చేసిన కార్యక్రమాల గురించి ఆరా తీశారు. శ్రీకాకుళం నగరంలోని సింహ ద్వారం మరికొంత విస్తరించాలని సూచించారు. నవ భారత్ కూడలి వద్ద ఫ్లై ఓవర్ బ్రిడ్జి ఆవశ్యకతను గుర్తు చేశారు. వరుసగా రెండు ఫ్లై ఓవర్లకు అనుమతులు మంజూరు కష్టంగా మారుతోందని అధికారులు వివరించగా.. ఆ నిర్మాణం త్వరితగతిన జరిగే విధంగా, రాష్ట్రం నుండి అనుమతులు మంజూరు అయ్యే విధంగా ప్రతి సమీక్షలోనూ విధిగా చర్చ జరగాలని సూచించారు. జాతీయ రహదారులను ఆనుకుని బ్లాక్ స్పాట్స్ ను నిర్ధారణ చెయ్యడం, భవిష్యత్ లో ప్రమాద రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. జాతీయ రహదారిని ఆనుకుని ట్రామా కేర్ సెంటర్లను శ్రీకాకుళం, టెక్కలి, ఇచ్చాపురం లలో ఏర్పాటు చెయ్యాలని సూచించారు. వ్యవసాయ శాఖపై సమీక్షిస్తూ.. పంట మార్పిడి విధానంపై రైతులు అవగాహన తెచ్చుకునే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. యంత్రాల వినియోగాన్ని విస్తృతం చెయ్యాలని,, వ్యవసాయం శ్రీకాకుళం జిల్లాలో వృద్ధి చెందడం ద్వారా జిల్లా జి.డి.పి పెరిగే అవకాశం ఉన్నట్టు స్పష్టం చేశారు. పొలం బడి కార్యక్రమం జరుగుతున్న తీరును తెలుసుకున్నారు. పొలం బడి కార్యక్రమం ప్రతీ నియోజకవర్గంలో ఓ మండలం మోడల్ మండలంగా ఎంచుకుని, రెండు వందల మంది రైతులతో ఉత్తమ ఫలితాలు సాధించేవిధంగా పొలం బడి కార్యక్రమాన్ని విస్తరించాలని అధికారులను ఆదేశించారు. రబీ సీజన్ లో మొక్కజొన్న పంట ఎక్కువ ఏరియాలో సాగు అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం అధిక సబ్సిడీ అందిస్తూ రైతులకు ఉపయోగకరంగా ఉన్న కిసాన్ డ్రోన్ పథకంపై మరింత ప్రచారం కల్పించాలని అధికారులను ఆదేశించారు. వరి కోతల సమయంలో ఉపయుక్తంగా ఉండే డ్రైన్ల నిర్వహణపై కూడా ప్రత్యేకంగా సమీక్షించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు జిల్లాలో వ్యవసాయ సంబంధ సమస్యలను ప్రస్తావించారుఅదేవిధంగా పౌర సరఫరాలు, డ్వామా, రూరల్ వాటర్ స్కీం లోని జల జీవన్ మిషన్, వైద్య ఆరోగ్య శాఖ, మైన్స్,




విద్య, సమగ్ర శిక్ష, మున్సిపాలిటి శాఖల పై అక్కడి అధికారులతో ప్రత్యేకంగా సమీక్షించారు. జిల్లాలో సర్వ శిక్ష అభియాన్ కార్యక్రమాలు ఆలస్యం అవుతుండటం పై అక్కడి అధికారులను ఆరా తీశారు. ఉపాధి హామీ పథకంపై సమీక్షిస్తూ.. గ్రామాల వారీగా నివేదిక కావాలని రామ్మోహన్ నాయుడు కోరారు. చెల్లింపు జరగాల్సిన బిల్లుపై కూడా అధికారుల వివరణను అడిగి తెలుసుకున్నారు. జల జీవన్ మిషన్ ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయని, ప్రతీ ఇంటికి కుళాయిని అందించే వరకూ అధికారులు అందరూ నిమఘ్నమై ఉండాలని అన్నారు. ఆరోగ్య శాఖపై సమీక్షిస్తూ.. అనస్తీషియ వైద్యులు తక్కువగా అందుబాటులో ఉన్న విషయాన్ని గుర్తు చేశారు. ఎనీమియా రహిత జిల్లాగా శ్రీకాకుళం ను తీర్చిదిద్దాలని కోరారు. ఈ సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యేలు గొండు శంకర్, బగ్గు రమణమూర్తి, కలెక్టర్ స్వప్నిల్ దినకర్, ఎస్పి మహేశ్వర రెడ్డి, జిల్లా స్థాయి అధికారులు, పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# బాలు పురస్కార గ్రహీత భాస్కర రావుకు ప్రపంచ తెలుగు మహాసభల ఆహ్వానం

**నవతరం - శ్రీకాకుళం**



ఘంటసాల, బాలు, ఆనంద్ (జి బి ఏ) స్వరమాధురి వెల్ఫేర్ సొసైటీ శ్రీకాకుళం వారి ద్వారా ఇటీవల బాలు స్మారక పురస్కారాన్ని అందుకున్న సీనియర్ జర్నలిస్ట్ కె భాస్కరరావు కు ప్రపంచ తెలుగు మహాసభల వేదికపై పాటలు పాడే అవకాశం లభించింది. ఈ మేరకు తాను ఈ కార్యనిర్వాహక సంస్థ ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షు లు గజల్ శ్రీనివాస్ నుండి ఆహ్వానాన్ని అందుకున్నట్లుగా ఓ ప్రకటనలో తెలియజేశారు. గుంటూరు వేదికగా జనవరి 3, 4, 5 తేదీలలో జరగబోయే ఈ తెలుగు మహా క్రతువులలో మూడవ తేదీన భావయుక్తమైన రెండు బాలు గీతాలను భాస్కర్ అక్కడ ఆలపించనున్నారు. శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి గ్రామానికి చెందిన ఈయన తెలుగు చలనచిత్ర పరిశ్రమ డబ్బింగ్ రంగంలో శాశ్వత సభ్యత్వం కలిగి వున్నారు .ఆ సంఘంలో ఉత్తమ పార్లమెంటేరియన్ సత్కారాన్ని కూడా పొందియున్నారు. అలాగే హైదరాబాద్ తెలుగు విశ్వవిద్యాలయం ద్వారా మాస్టర్ ఆఫ్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం (యం సి జె) లో పట్టా భద్రునిగా ఉత్తీర్ణులయ్యారు. ఇదే విశ్వవిద్యాలయంలో లలిత సంగీతం డిప్లమా కోర్స్ చేసి ఆ కోర్సులో గాన గంధర్వ గాయకులు ఘంటసాల మాస్టర్ వారి కుటుంబ సభ్యుల ద్వారా మొదటి బ్యాచ్ ఉత్తమ విద్యార్థిగా నగదు పురస్కారాన్ని అందుకున్నారు. ప్రముఖ సుప్రసిద్ధ లలిత సంగీత విద్వాంసులు పాలగుమ్మి విశ్వనాథం, మహాభాష్యం చిత్తరంజన్, బండారు చిట్టిబాబు మాస్టర్ ల వద్ద ప్రియ శిష్యుడిగా పేరు సంపాదించుకున్న ఈయన విశాఖ ఆల్ ఇండియా రేడియో కేంద్రంలో బి గ్రేడ్ గాయకుడిగా కొనసాగుతున్నారు. ఈటీవీ పాడుతా తీయగా సీనియర్స్ విభాగంలో ఈ జిల్లా నుండి ఎంపిక కాబడిన ఇద్దరు గాయకులలో ఈయన ఒకరు. అనివార్య కారణాల వలన ఆ సిరీస్ ప్రసారం కానప్పటికీ ఆ సందర్భంగా పాడుతా తీయగా వేదికపై బాలు గారి సమక్షంలో పాటలు పాడియున్నారు. నాటి జన్మభూమి కార్యక్రమాలలో రాష్ట్ర సాంస్కృతిక శాఖ తరపున జిల్లా కోఆర్డినేటర్ గా నియమితులై జిల్లా నలుమూలల కళాబృందాలకు సమన్వయ కర్తగా వ్యవహరించారు. ఆనాడు సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొన్న ఇచ్ఛాపురం భారీ బహిరంగ సభలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణలో ఇతను కూడా అక్కడ ఓ సమన్వయ కర్తగా వ్యవహరించియున్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే ఈయన ప్రతిభా పాటవాలు కోకొల్లలు. ప్రస్తుతం ఈయన ఫ్రీలాన్స్ జర్నలిస్టుగా కొనసాగుతూనే కోటబొమ్మాళి జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో పార్ట్ టైం డ్రాయింగ్ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇన్ని కళా నైపుణ్యాలు కలిగి వున్న ఈయనకి ఈ ప్రపంచ తెలుగు మహాసభలలో పాడే అవకాశం లభించడం పట్ల జిల్లా వ్యాప్తంగా పలువురు ప్రముఖులు అభినందనలు తెలియజేస్తూ హర్షాతిరేకాలు వెలుబుచ్చుతున్నారు.

# రాజ్యాధికారానికి దూరంగా యాదవులు

(తలగాపు ఝాన్సీ వెంకటరమణ - ఫ్రీ లాన్స్ జర్నలిస్ట్)

దేశంలో ఒక పెద్ద సామాజిక వర్గం తో పాటు అనేక రాజకీయ పార్టీలలో ముఖ్యమైన పాత్ర పోషిస్తూ, ముఖ్యమంత్రులు, మంత్రులను అందించడమే కాక ఎంతో చారిత్రిక నేపథ్యం కలిగిన యాదవ సామాజిక వర్గం ఆంధ్రప్రదేశ్ విషయంలో యాదవుల రాజకీయ స్థితిగతులు మిశ్రమంగా ఉన్నాయి. ఒకప్పుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయాల్లో ఎక్కువగా కమ్మ, రెడ్డి, బ్రాహ్మణ, వైశ్య కులాల చుట్టూ తిరిగేవి. తర్వాత ఆ స్థానంలో కాపు సామాజిక వర్గం వచ్చి చేరింది. తాజాగా వీటి సరసన మరొక సామాజిక వర్గం వచ్చి చేరడం అనివార్యంగా మారింది. అదే యాదవ సామాజిక వర్గం. కులాల ప్రస్తావన లేకుండా ఆంధ్రప్రదేశ్ రాజకీయాలను ఊహించలేం. ప్రస్తుతం రెండు మూడు పార్టీలు బలంగా ఉన్నట్లు కనిపించడానికి కారణం.. ఆయా పార్టీల వెనుక ఏదో ఒక కులం వెన్నుదన్నుగా నిలవడమే. ప్రతి నియోజకవర్గంలో గణనీయంగా బీసీలు ఉన్నప్పటికీ, అందులో ఎక్కువగా యాదవ సామాజిక వర్గం ఉండడంతో, ఎన్నికల్లో కొన్నిచోట్ల డిసైడింగ్ ఫ్యాక్టర్ గా ఉండడంతో యాదవ కులానికి ఓటు బ్యాంకుగా ఎన్నికల వరకే వాడుకొని.. తరువాత కరేపాకుగా కొన్ని రాజకీయ పార్టీలు వదిలేస్తున్నాయి. యాదవులు సంఖ్యాపరంగా ఆంధ్రప్రదేశ్ లో దాదాపు 70 లక్షల జనాభా కలిగి ఉన్నప్పటికీ, జనాభా దామాషా పద్ధతిలో వారికి తగ్గ సామాజిక న్యాయం జరగడం లేదన్న విమర్శలు లేకపోలేదు. ప్రధానంగా రాష్ట్రంలో యాదవులకు రాజకీయ ప్రాతినిధ్యం తక్కువగా ఉండేది. ఇటీవల కాలంలో తమ హక్కుల కోసం యాదవులు పోరాడుతున్నారు. ఈ నేపథ్యంలో కొన్ని రాజకీయ పార్టీలు వారిని గుర్తించడం మొదలు పెట్టాయి. యాదవులు పెద్ద సంఖ్యలో ఉన్నప్పటికీ రాజకీయాల్లో వారికి తగ్గ ప్రాతినిధ్యం దక్కడం లేదని, ప్రధాన పార్టీలు కమ్మ, రెడ్డి, కాపు, బలిజ, వెలమ వంటి ఇతర వర్గాలకే రాజ్యాధికారంలో భాగస్వామ్యం కల్పిస్తూ.. యాదవులను విస్మరించా రన్న ఆరోపణలు లేకపోలేదు. యాదవులు చారిత్రాత్మకంగా, సామాజికంగా.. క్రియాశీలకంగా ఉన్నప్పటికీ, రాజకీయ అధికారాన్ని సంపాదించడంలో వెనుకబడిపోయారు.
యాదవ సామాజిక వర్గంలో చాలా ఉప కులాల విభజన ఉండడం, వారి సంఖ్య బలం ఉన్నప్పటికీ, ఏకీకృత రాజకీయ శక్తిగా ఎదగలేకపోవడం ఒక కారణంగా చెప్పవచ్చు. అంతేగాక చాలామంది యాదవులు ఆర్థికంగా వెనుకబడి ఉండడం, విద్య, వ్యాపార రంగాలలో వీరికి సరైన ప్రోత్సాహం లేకపోవడం, కొన్ని ప్రాంతాల్లో యాదవులకు రాజకీయ అవగాహన తక్కువగా ఉండడం, నాయకత్వ లోపం లేకపోలేదు. గడచిన రెండు సార్వత్రిక ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయాలు విషయానికి వస్తే.. కులాల వారీగా ఓట్లు వేటను నాడు ఆరంభించాయి. ఒకప్పుడు బీసీలకు ఎన్టీ రామారావు తెలుగుదేశం పార్టీ తరఫున ప్రోత్సహించగా, కాంగ్రెస్ ప్రభుత్వంలో నాటి ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి కూడా బీసీలను రాజకీయంగా ప్రోత్సహించారు. వైఎస్ఆర్సిపి అధికారంలోకి రాక మునుపు అనూహ్యంగా బీసీలపై ఆ పార్టీ పెద్ద ఫోకస్ పెట్టింది. తర్వాత ఎన్నికల్లో వైయస్సార్సీపి అధికారంలోకి వచ్చింది. 2024 ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం మళ్లీ బీసీల జపం చేయడంతో అనూహ్యంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రా గలిగింది. అధికారంలోకి వచ్చాక ప్రధానంగా యాదవ సామాజిక వర్గానికి అనుకున్నంతగా కూటమి ప్రభుత్వం రాజ్యాధికారంలో కీలక భాగస్వామ్యం కల్పించలేకపోయిందన్న విమర్శలు లేకపోలేదు.
ఇటీవల కాలంలో యాదవుల్లో రాజకీయ చైతన్యం పెంచడంతోపాటు వారి హక్కుల కోసం కొన్ని యాదవ సంఘాలు పోరాడుతున్నాయి. ముఖ్యంగా ఎన్నికల సమయంలో సీట్లు కేటాయింపు పై డిమాండ్ చేస్తున్నాయి. ఇప్పుడిప్పుడే కొన్ని రాజకీయ పార్టీలు కూడా యాదవుల్ని గుర్తించడం మొదలుపెట్టాయి. రానున్న స్థానిక సంస్థ ఎన్నికలలో యాదవులకు తమ సంఖ్యా బలానికి అనుగుణంగా రాజకీయాల్లో భాగస్వామ్యం కల్పించాలని డిమాండ్ చేస్తున్నాయి. 2029 ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీ, ఇతర రాజకీయ పదవుల్లో యాదవులకు తగినంత వాటా ఇవ్వాలని యాదవ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. జనాభా ప్రాతిపదికన అన్ని రాజకీయ పార్టీలు స్థానిక సంస్థల ఎన్నికలతో సహా అన్ని ఎన్నికలలో యాదవులకు సీట్లు కేటాయించాలని ఆ సామాజిక వర్గం పెద్దలు డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యంగా ఉత్తరాంధ్రలో యాదవ సామాజిక వర్గం సామాజిక ఆర్థిక స్థితిగతులు దయనీయంగా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా విషయానికి వస్తే ఒకసారి భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ ఇచ్చాపురం నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున ఎమ్మెల్యే అభ్యర్థిగా యాదవ సామాజిక వర్గానికి చెందిన నర్తు రామారావు కు టికెట్ ఇచ్చింది. అయితే ఆ ఎన్నికల్లో ఆయన గెలవలేదు. వైయస్సార్సీపీలో కూడా నర్తు రామారావుకు టికెట్ లభించినప్పటికీ ఆయన ఓడిపోయారు. తర్వాత రోజుల్లో వైయస్సార్సీపి అధిష్టానం అధికారంలో ఉన్నప్పుడు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కోటా కింద ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలోకి నర్తు రామారావు యాదవును దించగా, ఆయన విజయం సాధించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు 19 నెలలు గడిచినప్పటికీ, శ్రీకాకుళం జిల్లాలో యాదవులకు రాజకీయంగా సముచిత స్థానం కల్పించకపోవడం పట్ల యాదవులు అసంతృప్తిగా ఉన్నారు.
తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడానికి కొన్ని పర్యాయాలు యాదవులు ఓట్లు వేసినప్పటికీ, వారికి తగ్గట్లు రాజ్యాధికారంలో భాగస్వామ్యం కల్పించకుండా ఇతర సామాజిక వర్గాలకు వివిధ పదవులు పంపకంలో పెద్ద పీట వేసి యాదవులకు మొండి చెయ్యి చూపించారు. శ్రీకాకుళం జిల్లాలో కళింగ, కాపు, వెలమ సామాజిక వర్గాల తోపాటు నాలుగో ప్రాధాన్యత సామాజిక వర్గంగా ఉన్న యాదవులకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం కల్పించకుండా కొన్ని రాజకీయ పార్టీలు విస్మరించిన తీరుపై యాదవులు మేధో మదనం చేస్తున్నారు. భవిష్యత్తులో స్థానిక సంస్థల ఎన్నికల విషయానికి వస్తే జిల్లా పరిషత్ పరిషత్ చైర్మన్ పీఠం యాదవులకు ఇవ్వాలని, లేకపోతే 2029 ఎన్నికల్లో ఇచ్చాపురం గాని, టెక్కలి అసెంబ్లీ స్థానాలు యాదవులకు కేటాయించాలని, లేకపోతే శ్రీకాకుళం పార్లమెంటరీ స్థానం యాదవులకు కేటాయించాలని ఆ సామాజిక వర్గం ప్రతినిధులైన లాకా వెంగళరావు, నర్తు నరేంద్ర యాదవ్, గద్దిబోయిన గురునాథ్ యాదవ్, ఉలాల బాలయ్య యాదవ్, అందాల శేషగిరి యాదవ్, డొక్కరి దానయ్య యాదవ్ తదితర పెద్దలు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో శ్రీకాకుళం సమీపంలో అంపోలు రోడ్డు దరి జిల్లా యాదవుల ఆత్మీయ కలయిక ఆదివారం నిర్వహిస్తున్న నేపథ్యంలో, ప్రధానంగా స్థానిక సంస్థల ఎన్నికలలో యాదవులకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం అన్న అంశంపై రాజకీయ ఎజెండా పై చర్చించే అవకాశాలు ఉన్నట్లు సమాచారం.

Printed by **SIRIGIRI VARADARAJU**, and published by **SIRIGIRI VARADARAJU**, on behalf of **SIRIGIRI VARADARAJU**, and printed at : Kranthi Publications, D.No.2-504/1, **Aditya Nagar** Colony, **Arasavilli,** Srikakulam,Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, **Published at :** Kranthi Publications, D.No.2-504/1, Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor : **SIRIGIRI VARADARAJU**, Email: navataramraju@gmail.com, **Cell : 9959007255, 8340844777**